'సంత్ సేవాలాల్ గొప్ప మానవతావాది'

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మానవతా విలువలను కాపాడుతూ జీవించాలని ప్రబోధించిన గొప్ప మానవతావాది సంత్ సేవాలాల్ అని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. జేఎన్‌టీయూ ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సేవాలాల్ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సేవాలాల్‌కు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రెక్టార్ డాక్టర్ విజయకుమార్ రెడ్డి, వివిధ విభాగాలకు చెందిన ప్రొఫెసర్లు డాక్టర్ బాలు నాయక్, ఇ.రాంజీ, ఎం.టి.నాయక్, సైదా నాయక్, బలరాం నాయక్, డాక్టర్ మాధవీకుమారి, పలువురు ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

6న ఇందిరానగర్ బస్తీ సంక్షేమ సంఘం ఎన్నికలు

బాలానగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఇందిరానగర్ బస్తీ సంక్షేమ సంఘం ఎన్నికకు రంగం సిద్ధమైంది. మార్చి 6న ఎన్నికలు నిర్వహించనున్నారు. గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ, శుక్రవారం నామినేషన్ల ఉపసంహరణ, శనివారం బరిలో నిలిచిన అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తారు. ఈ ఎన్నికల్లో 1451 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో 12ప్యానెల్లు అధ్యక్షుడు, జనరల్ సెక్రెటరీ, కోశాధి కారి పదవులకు పోటీ పడుతున్నట్లు సమాచారం. 2003లో మొట్ట మొదటి సారి బస్తీకి ఎన్నికలు జరిగాయి. 2015లో చివరి సారిగా ఎన్నికలు జరుగగా అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీగా మధు గౌడ్ ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ఎన్నికలు జరగకపోవడంతో బస్తీ నాయకులు సమావేశమై ఎన్నికల తేదీపై నిర్ణయం తీసుకున్నారు.

కుత్బుల్లాపూర్‌లో అగ్ని ప్రమాదం

- మంగళవారం అర్ధరాత్రి ఘటన
- కాలి బూడిదైన దుకాణాలు



కాలి బూడిదైన దుకాణాలు

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని పలు దుకాణాలు దగ్ధమైన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సుచిత్ర- కుత్బుల్లాపూర్ రహదారిలో ఉన్న స్టేట్ బ్యాంకు ఎదురుగా రోడ్డు పక్కన కొందరు వీధి వ్యాపారులు వివిధ రకాల దుకాణాలు నిర్వహిస్తున్నా రు. మంగళవారం అర్ధరాత్రి సుమారు 11:15 గంటల సమయంలో దుకాణాల నుంచి మంటలు వస్తున్నట్లు గమనించిన స్థానికులు జీడిమెట్ల ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలికి వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో ప్రధానంగా పండ్ల దుకాణం, మాంసం దు కాణం, స్క్రాపు దుకాణం, జూస్ పాయింట్‌తో పాటు పలు రకాల దుకాణాలను నిర్వహిస్తున్నారు. పండ్ల దుకాణంలో ఉన్న 4రిఫ్రిజిరేటర్లతో పాటు పండ్లు, తోపుడు బండ్లు ఇతరత్ర సామగ్రి కాలి బూడిదయ్యాయి. మంటలు సుమారు మూడు అంతస్తుల ఎత్తుకు ఎగసి పడడంతో ఆ వేడికి పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ కిటికీల అద్దాలు పగిలిపోయాయి. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. సుమారు రూ.5 లక్షల నుంచి రూ.10లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశా రు. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్ర మాదం జరిగిందా లేక గ్యాస్ సిలిండర్ పేలడం వల్ల జరిగిందా అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఎగిసిపడుతున్న మంటలు

దుకాణం మూసి ఇంటికి వెళ్లేలోపు..



మంగళవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో పండ్ల దుకాణం మూసివేసి ఇంటికి బయలుదేరాము. మేము ఇంటికి చేరుకునే లోపే దుకాణంలో మంటలు చెలరేగాయని ఫోన్ చేసి చెప్పారు. తిరిగి వచ్చి చూసేసరికి అప్పటికే మంటలు భారీగా ఎగిసిపడుతున్నాయి. శివరాత్రి పండుగ దృష్ట్యా మంగళవారం ఉదయమే సుమారు రూ.4లక్షల విలువ గల పండ్లను తెచ్చి పెట్టాం. మొత్తం సుమారు రూ. 12 లక్షల విలువ గల ఆస్తి నష్టం జరిగింది.

- సురేందర్ మహర్యు, పండ్ల దుకాణం నిర్వాహకుడు

నేడు కాంగ్రెస్ సమావేశం

బాలానగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గురువారం సాయంత్రం 4గంటలకు కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మేడ్చెల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సి. హరివర్ధన్‌రెడ్డి హాజరు కానున్నట్లు వారు తెలిపారు.

టీబీ బాధితులను అలక్ష్యం చేయొద్దు : సంధ్యారాణి

బాలానగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): జాతీయ క్షయ నివారణ(ఎన్‌టీఈపీ) కార్యక్రమంలో భాగంగా బుధవారం మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా టీబీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సంధ్యారాణి జగద్గిరిగుట్ట బస్తీ దవాఖానాను సందర్శించారు. ఆమె దవాఖానాలో టీబీ బాధితుల వివరాలు ఆశావర్కర్లను అడిగి తెలుసుకున్నారు. టీబీ సూపర్ వైజర్‌తో కలిసి కూకట్‌పల్లి శివానంద రెహబిలిటేషన్ సెంటర్‌లో టీబీ బాధితులకు మందులు అందజేశారు.

పీహెచ్‌సీ సందర్శన

మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా మలేరియా ప్రోగ్రాం అధికారి డా.చంద్రకళ బుధవారం బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. పీహెసీలో రోగుల వివరాలు, నమోదైన మలేరియా కేసుల వివరాలను పీహెచ్‌సీ మెడికల్ అధికారి మమతను అడిగి తెలుసుకున్నారు.

6 నుంచి ఆలయ వార్షికోత్సవం

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మార్చి 6 నుంచి 10వరకు సూరారం ఎక్స్ రోడ్డులోని శివాహిల్స్‌లోని ఉమామహేశ్వర ఆలయం వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ముద్దాపురం మదన్‌గౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నట్లు తెలిపారు.

కార్పొరేటర్ పాదయాత్ర

హైదర్‌నగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ గణేష్‌నగర్‌లో బుధవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాదయాత్ర చేసి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో సమస్యల పరిష్కారంతో పాటు పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు త్వరలో చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. సోమేశ్వర రావు, నర్సింగ్, రెడ్డి, మోజేష్, కనకయ్య, మహేందర్ పాల్గొన్నారు.

చెరువులో గుర్రపుడెక్క తొలగింపు

మియాపూర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మియాపూర్‌లోని పటేల్‌చెరువులో చేపట్టిన గుర్రపుడెక్క తొలగింపు పనులను బుధవారం కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు ఏఈ గణేష్, నాయకులు పాల్గొన్నారు.

కాలుష్య కోరల్లో ప్రపంచం

- ఐఐసీటీ సీనియర్ సైంటిస్ట్ డా.ఎస్.వెంకట మోహన్
- అంబేద్కర్ వర్సిటీలో జాతీయ సైన్స్ దినోత్సవం



మాట్లాడుతున్న వెంకట మోహన్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రపంచం పూర్తిస్థాయిలో కాలుష్యం కోరల్లో చిక్కుకుంటోందని ఇది భవిష్యత్ తరాల మనుగడనే ప్రశ్నార్థకంగా మారుస్తుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐ.ఐ.సి.టీ) సీనియర్ శాస్త్రవేత్త డా.ఎస్.వెంకట మోహన్ అన్నారు. అంబేద్కర్ వర్సిటీలో వికసిత్ భారత్‌లో భాగంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన "సుస్థిర అభివృద్ధి సాంకేతిక జోక్యం"పై కీలకోపన్యాసం చేశారు. వాతావరణంలో కాలుష్య పరిమాణం రోజురోజుకూ పెరుగుతూ ఆందోళన కలిగిస్తోందని ఇది భవిష్యత్ తరాలకు తీవ్ర ఇబ్బంది కరంగా మారనుందన్నారు. గాలిలో కార్బన్‌డయాక్సైడ్ శాతం ఉండాల్సిన పరిమాణం కంటే ఎక్కువగా నమోదవుతోందని, విపరీతంగా పెరుగుతోన్న జనాభా కూడా దీనికి కారణంగా నిలుస్తుందన్నారు. కాలుష్య కారకాలను తగ్గించక పోతే భవిష్యత్‌లో మానవ మనుగడకే పెద్ద ముప్పుగా నిలుస్తుందన్నారు. వ్యర్థాలు రీ సైకిల్ చేయడం వల్ల కొంతమేర అటు గాలి, ఇటు జల కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చని ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేస్తున్నాయని, అయి నా ప్రజల భాగస్వామ్యం లేకుండా పూర్తిస్థాయిలో కాలుష్యాన్ని అరికట్టడం సాధ్యం కాదన్నారు. కాలుష్యాన్ని తగ్గించడానికి ఐఐసీటీ పరిశోధనలు చేస్తుందని, అనేక పరిశ్రమలు తమ ఉత్పత్తి కేంద్రాల నుంచి వ్యర్థాలను నేరుగా అటు భూమిలోకి ఇటు వాతావరణంలోకి వదలడం ద్వారా కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోందన్నారు. అంబేద్కర్ వర్సిటీ ఉపకులపతి ప్రొ.కె.సీతారామరావు మాట్లాడుతూ ఒకవైపు శాస్త్రీయ పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్నా మరో వైపు మూఢ నమ్మకాలు ప్రజలను ప్రభావితం చేస్తున్నాయన్నారు. శాస్త్ర సాంకేతిక రంగంలో సాధించిన అభివృద్ధి సామాన్యులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడ్డప్పుడే నిజమైన అభివృద్ధి జరుగుతుందన్నారు. విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్, సైన్స్ విభాగ డీన్ ప్రొ.పుష్ప చక్రపాణి మాట్లాడుతూ ప్రఖ్యాత భారతీయ పరిశోధకులు సర్ సి.వి.రామన్ గుర్తుంచుకునేలా ఆయన పేరున జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరపడం శుభసూచికమన్నారు.



ఆధునిక బ్రీత్ ఎనలైజర్ పరికరాలను అందజేస్తున్న డియాజియో సంస్థ ప్రతినిధులు

మద్యం తాగి వాహనాలు నడపడం ప్రమాదకరం

- డీజీపీ రవిగుప్తా

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడపడం తమతోపాటు ఎదుటి వారికి ప్రమాదకరమని డీజీపీ రవిగుప్తా అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌ను కట్టడి చేసి ప్రజలను ప్రమాదాల బారి నుంచి కాపాడేందుకు పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. డీజీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో డియాజియో కార్పొరేట్ ఎఫైర్స్ సీనియర్ జనరల్ మేనేజర్ రవివర్మ తెలంగాణ పోలీస్ శాఖకు 50 అత్యాధునిక బ్రీత్ ఎనలైజర్ పరికరాలను అందజేశారు. ఈసందర్భంగా డీజీపీ రవిగుప్తా మాట్లాడుతూ డియాజియో అందించిన పరికరాలు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఉపయోగపడుతాయని చెప్పారు. బాధ్యతాయుతంగా వాహనాలు నడపడం వల్ల తమతోపాటు ఇతరుల ప్రాణాలు కాపాడవచ్చని అదనపు డీజీపీ(రోడ్డు భద్రత) మహేష్ భగవత్ అన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని కట్టడి చేసేందుకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పష్టమైన ప్రణాళికతో పనిచేస్తున్నారని అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. డియాజియో సంస్థ ప్రతినిధులు, పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

'బెంగాళీ నామశూద్రులకు ఎస్సీ హోదా ఇవ్వండి'

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బెంగాళీ నుంచి వలస వచ్చి స్థిరపడిన నామశూద్రులను ఎస్సీ జాబితాలో చేర్చి రిజర్వేషన్ వర్తించేలా చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన పలువురు బెంగాళీ నామశూద్రులతో కలిసి నగరంలోని జాతీయ ఎస్సీ కమిషన్ ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లారు. డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1971లో బంగ్లాదేశ్ నుంచి వేలాది మంది శరనార్థులుగా వచ్చి కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలో స్థిరపడ్డారని తెలిపారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో నామశూద్రులను ఎస్సీలుగా గుర్తించి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఎస్సీ జాబితాలో చేర్చేలా కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపటి నుంచి జేఎన్‌టీయూ ఎఫ్‌ఎఫ్‌సీ తనిఖీలు

- 218 అఫిలియేటెడ్ కళాశాలల్లో...
- 25 బృందాల ఏర్పాటు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ (ఎఫ్ఎఫ్‌సీ) తనిఖీలకు జేఎన్‌టీయూ సన్నద్ధమైంది. మార్చి 1 నుంచి 9 తేదీ వరకు వివిధ ఇంజనీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ కళాశాలల్లో ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలు కొనసాగనున్నాయి. జేఎన్‌టీయూ పరిధిలో మొత్తం 218 అఫిలియేటెడ్ కళాశాలలు ఉండగా, వీటిలో ఇంజనీరింగ్ 142, ఫార్మసీ 71, మేనేజ్‌మెంట్ కళాశాలలు 5 ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ఎఫ్ఎఫ్‌సీ తనిఖీల నిమిత్తం యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లను 25 బృందాలుగా ఏర్పాటు చేశారు. జేఎన్‌టీయూ అఫిలియేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రైవేట్ కాలేజీల్లో ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఇంజనీరింగ్ కోర్సుల్లో సీట్ల సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతులు, ఆచార్యులు, సిబ్బంది హాజరు.. తదితర అంశాలను ఎఫ్ఎఫ్‌సీ బృందాలు తనిఖీ చేయనున్నాయి. తనిఖీలకు వెళ్లే సభ్యుల నుంచి యూనివర్సిటీ అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు మినహాయింపు ఇచ్చినట్లు తెలిసింది.

ఏఐసీటీఈ అనుమతులు రాకున్నా...

ప్రైవేటు కాలేజీల్లో కొత్తగా ప్రవేశపెడుతున్న కోర్సులకు, సీట్ల సంఖ్యకు అఖిలభారత సాంకేతిక విద్యామండలి నుంచి అనుమతి రాకమునుపే జేఎన్‌టీయూ తనిఖీలు చేపట్టడం వలన ఒనగూరే ప్రయోజనమేంటో అర్థం కావడం లేదని కొన్ని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు వాపోతున్నాయి. ఒకవేళ జేఎన్‌టీయూ ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలు పూర్తయ్యాక, ఏఐసీటీఈ నుంచి అనుమతి రాకుంటే పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. కాగా, ఎఫ్ఎఫ్‌సీ తనిఖీల నిమిత్తం ప్రతిరోజూ దూర ప్రాంతాల్లో ఉన్న కళాశాలలకు వెళ్లి రావడంలో వర్సిటీ ప్రొఫెసర్లకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున, ప్రతి ప్రొఫెసర్‌కు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని జేఎన్‌టీయూ ఆచార్యుల సంఘం గతంలో పలుమార్లు యాజమాన్యానికి విజ్ఞప్తి చేసింది. ఈ ఏడాదైనా తనిఖీలకు వెళ్లే ఆచార్యులకు ఇన్సూరెన్స్ సదుపాయాన్ని ఉన్నతాధికారులు కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బాల్యం నుంచే నాణ్యమైన విద్యనందించాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు బాల్యం నుంచే తమ పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. నానక్‌రామ్‌గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని టెక్‌పార్కులో ఏర్పాటు చేసిన సఫారీ కిడ్ ప్రీస్కూల్, డేకేర్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా యశస్వినీరెడ్డి మాట్లాడుతూ ప్లే స్కూళ్లలో చేర్పించడం ద్వారా పిల్లలు సులువుగా స్కూళ్లకు అలవాటుపడుతారన్నారు. సఫారీ కిడ్ ఇండియా చైర్మన్ జితేంద్ర కర్సన్ మాట్లాడుతూ.. వచ్చే విద్యా సంవత్సరం నాటికి దేశమంతటా 10 అదనపు కేంద్రాలను ఏర్పాటు చేయడమే సఫారీ కిడ్ ఇండియా లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సఫారీ కిడ్ హైదరాబాద్ సెంటర్ ఫ్రాంఛైజీ భాగస్వామి, టెక్ లీడర్ సాహితీరెడ్డి పాల్గొన్నారు.

'డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి'

హైదర్‌నగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నిజాంపేట రోడ్డులోని గ్రీన్‌కోర్టు అపార్ట్‌మెంట్ వద్ద తలెత్తిన డ్రైనేజీ సమస్యను సివరేజ్ బోర్డు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి బుధవారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. సమస్య పరిష్కారానికి మ్యాన్‌హోల్ నుంచి మ్యాన్‌హోల్ వరకు బకెట్ క్లీనింగ్ ద్వారా పూడిక తీయాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు మేనేజర్ ప్రశాంతి, వర్క్ఇన్‌స్పెక్టర్ మహదేవ్, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, అపార్ట్‌మెంట్ వాసులు చంద్రం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంటీకాలనీలో వ్యక్తి దారుణ హత్య

జీడిమెట్ల, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎంటీకాలనీలోని నిర్మానుష్య ప్రాంతంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు, మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం, ఔరంగాబాద్, తానా, అజాద్ బిగా గ్రామానికి చెందిన రమేష్‌రామ్(45) కుటుంబసభ్యులతో కలిసి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి జీడిమెట్ల రామిరెడ్డినగర్‌లో నివాసముంటున్నాడు. స్థానికంగా ఉన్న వినాయక కెమికల్స్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రమేష్‌రామ్‌కు భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు. రమేష్‌రామ్ మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో స్నేహితులతో కలిసి పైప్‌లైన్ రోడ్డులోని ఓవైన్‌షాప్ వద్ద మద్యం తాగారు. రాత్రి ఇంటికి వెళ్లలేదు. బుధవారం తెల్లవారుజామున హెచ్‌ఎంటీ కాలనీలోని నిర్మానుష్య ప్రాంతంలో హత్యకు గురై కనిపించాడు. రమేష్‌రామ్‌ను వాకింగ్ చేస్తున్న వ్యక్తులు గుర్తించి జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా మృతుడి ఒంటిపై దుస్తులు ఊడదీసి ఉన్నాయి. బీరుబాటిళ్లతో తలపై కొట్టిన ఆనవాళ్లున్నాయి. మృతుడి వద్ద లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా వివరాలు సేకరించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించారు. రామిరెడ్డినగర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దారుణానికి పాల్పడింది హిజ్రాలు అయి ఉంటారేమోనన్న కోణంలోనూ పోలీసులు విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ఎన్‌డీపీఎస్ కేసులో నిందితులకు జైలు, జరిమానా

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నార్కొటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) కేసులో ఏ1 నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10లక్షలు జరిమానా, ఏ2కు రెండు సంవత్సరాల కారాగార శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డా.పట్టాభి రామారావు తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజిరెడ్డి కథనం ప్రకారం.. 2022 సెప్టెంబర్ 22న గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో కొందరు యువకులు గంజాయి తరలిస్తుండగా, వేవ్‌రాక్ రోడ్‌లో పోలీసులు జరిపిన తనిఖీల్లో పట్టుబడ్డారు. వారి వద్ద సుమారు 72 కిలోల గంజాయిని గుర్తించారు. గచ్చిబౌలి పోలీసులు చార్జ్‌షీట్ వేయగా, విచారణ అనంతరం న్యాయమూర్తి తాజాగా తీర్పు విలువరించారు.

నాలాల పనులు పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

అల్లాపూర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మైసమ్మ చెరువు, కాముని చెరువు ద్వారా పారే నాలాల పనులను వర్షా కాలంలోపు పూర్తి చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు సూచించారు. బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మైసమ్మ చెరువు, కాముని చెరువు అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. సమావేశంలో కార్పొరేటర్ సబీహ బేగం, ఎమ్మార్వో స్వామి, డీ.ఈ. ఆనంద్, ఇరిగేషన్ ఏ.ఈ. లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

'ప్రజల మనోభావాలను దెబ్బతీయొద్దు'

అల్లాపూర్: కూకట్‌పల్లి ప్రశాంత్ నగర్‌లోని దయార్‌గూడ వాసులు పునర్నిర్మిస్తున్న చిత్తారమ్మ ఆలయం పనులకు సంబంధించి ఐడీపీఎల్ సంస్థ వారు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కలుగజేసుకొని సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేశారు. దాదాపు 100సంవత్సరాల నాటి చిత్తారమ్మ దేవాలయం బఫర్ జోన్‌లో ఉందన్న ఎమ్మెల్యే పురాతన దేవాలయ అభివృద్ధి పనులను అడ్డుకుని ప్రజల మనోభావాలను దెబ్బ తీయొద్దని సూచించారు. డా.బీఆర్ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశ ప్రగతి'

బేగంపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదిగనప్పుడే దేశ ప్రగతి సాధ్యమవుతుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఇటీవల బేగంపేటలో మయూరి మార్గ్‌కు చెందిన సుమారు 40 మంది మహిళలకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో కుట్టుమిషన్లు అందజేశారు. మహిళలు బుధవారం ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విజయగణపతి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్ న్యూ వివేకానంద నగర్‌లో నిర్మించనున్న విజయగణపతి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ దాసుగౌడ్, కమిటీ సభ్యులు విశాల్, బుచ్చిరెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, సత్తయ్య గౌడ్, అనిల్‌కుమార్, రమణారెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

డబ్బులడిగితే ఫిర్యాదు చేయండి

- రవాణాశాఖలో ఏ సర్వీసు కావాలన్నా మేం చేస్తాం
- ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో కూకట్‌పల్లి ఎంవీఐ లావేటి శ్రీనుబాబు

ఆర్టీఏలో ఏ పని కావాలన్నా బ్రోకర్‌ను సంప్రదించాలా ? డబ్బులు ఇస్తే వెంటనే పనులు చేస్తారా ? రవాణాశాఖలో సేవలు పొందేందుకు సాధారణ ప్రజానీకానికి ఉన్న సందేహాలివి. ఇక్కడ ఏ సర్వీసు కావాలన్నా మేం చేసిపెట్టడానికి రెడీగా ఉన్నామని ఇటీవలే బాధ్యతలు తీసుకున్న కూకట్‌పల్లి ఎంవీఐ (మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్) లావేటి శ్రీనుబాబు చెబుతున్నారు.

- కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి)



ఎంవీఐ లావేటి శ్రీనుబాబు

ఇంటర్వ్యూ...

ఆంధ్రజ్యోతి: రవాణా శాఖలో సేవలు ఎలా పొందాలి?

ఎంవీఐ: రవాణాశాఖలో ఏ సర్వీసు కావాలన్నా అన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. లెర్నర్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, క్లియరెన్స్ సర్టిఫికెట్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఏదైనా సరే ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకొని పేమెంట్ చేసుకొని మా దగ్గరకు వస్తే డాక్యుమెంట్లు పరిశీలించి క్లియరెన్స్ ఇస్తాం. దీనికి ఏ అధికారి లేదా సిబ్బందికి పైసా కూడా ఇవ్వాల్సిన పనిలేదు. ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు పూర్తవుతాయి కాబట్టి ఇక్కడ నగదుతో పనిలేదు. లైసెన్స్, ఆర్సీ 48 గంటల్లోనే చిరునామాకు డెలివరీ చేస్తున్నాం. వెనక్కి వచ్చినవి తీసుకోవాలంటే ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు రశీదు చూపించి తీసుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి: వాహనం అమ్మేటప్పుడు, కొనేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏంటి?

ఎంవీఐ: సెకండ్ హ్యాండ్‌లో ఓ వ్యక్తి లేదా బ్రోకర్, సంస్థ ద్వారా నేరుగా లేదా వేలం పాటలో వాహనం అమ్మడం, కొనడం జరుగుతుంది. వాహనం అమ్మిన వ్యక్తి సీసీ లేదా ఎన్‌వోసీ ఇచ్చి ఫారం 29, 30లో సంతకాలు చేసి వదిలేస్తే సరిపోదు. అవతలి వ్యక్తి పేరుపైకి మార్చుకునే వరకు అమ్మిన వ్యక్తి బాధ్యత తీసుకోవాలి. కాని పక్షంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఆ వాహనం అమ్మిన వ్యక్తి ఇబ్బందులకు గురవుతాడన్న విషయం గుర్తుంచుకోవాలి.

ఆంధ్రజ్యోతి: మైనర్ల తల్లిదండ్రులకు మీరు ఇచ్చే సూచనలు?

ఎంవీఐ: 18 సంవత్సరాల లోపు పిల్లలు బైక్ లేదా కారు ఏ ఇతర వాహనం కూడా నడుపుకుంటూ రోడ్డు మీదకు రాకూడదు. పిల్లలు పట్టుబడితే సదరు వాహన యజమానిపై కేసు నమోదు అవుతుంది. కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానా, అవసరమైతే ఒక్కోసారి జైలుకు కూడా వెళ్లాల్సి ఉంటుంది. అర్హత ఉన్న పిల్లలకు వెంటనే లైసెన్స్‌కు అప్లై చేసేలా తల్లిదండ్రులు చూసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: రవాణాశాఖలో సమస్యలు ఉంటే ఎవర్ని సంప్రదించాలి ?

ఎంవీఐ: కూకట్‌పల్లి ఎంవీఐకి ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. అలా కాకుండా అన్ని పని దినాలలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నేరుగా నన్ను సంప్రదించి సమస్య చెబితే పరిష్కారానికి కృషి చేస్తా. ఏమైనా ఫిర్యాదులు ఉంటే 90106 10999కు ఫోన్‌చేసి కూడా చెప్పొచ్చు.

ఆంధ్రజ్యోతి: యువతకు మీరు ఇచ్చే సలహాలు ఏంటి ?

ఎంవీఐ: అర్హులైన ప్రతి ఒక్కరూ లైసెన్స్ తీసుకోవాలి. హెల్మెట్ ధరించడంతో పాటు పెద్ద వాహనాలు నడిపేవారు బెల్ట్ పెట్టుకోవాలి. లెర్నింగ్ లైసెన్స్ ఉంది కదా అని ఎల్ బోర్డు పెట్టకపోయినా, టూ వీలర్ అయితే వెనకాల లైసెన్స్ ఉన్న వ్యక్తి లేకపోయినా, కారులో అయితే పక్క సీటులో లైసెన్స్ ఉన్న వ్యక్తి లేకుండా వాహనం నడిపితే కేసు నమోదవుతుంది.